
ఆంధ్రజ్యోతి

andhrajyothy.com



5

కామారెడ్డి
జిల్లా వార్తలు

గురువారం 9 అక్టోబరు 2025

స్పేస్ సైన్స్ క్విజ్ కాంపిటేషన్

కామారెడ్డి టౌన్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా కేంద్రంలో బుధవారం స్పేస్ సైన్స్ క్విజ్ కాంపిటేషన్‌ను బుధవారం విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. మొత్తం 248 మంది ఈ పోటీల్లో పాల్గొనగా 30 మంది బాలికలను ఎంపిక చేసినట్లు డీఈవో రాజు తెలిపారు. జిల్లాలో పదో తరగతి చదువుతున్న బాలికలను ఇస్రో టూర్‌కు పూర్తిగా ప్రభుత్వ ఖర్చులతో తీసుకెళ్లాలని నిర్ణయించడమైందని తెలిపారు. ఇలాంటి ప్రతిష్ఠాత్మకమైన సంస్థల్లో శాస్త్రవేత్తలుగా సేవలందించాలని దృక్పథం ఏర్పడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎస్‌వో సిద్ధిరాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మొదటి విడత ఎన్నికలకు సిద్ధంగా ఉన్నాం

● కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్



వీసీలో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ, అధికారులు

కామారెడ్డి టౌన్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మొదటి విడత ఎన్నికలకు సిద్ధంగా ఉన్నామని కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ అన్నారు. బుధవారం వీసీలో రాష్ట్ర ఎన్నికల అధికారిణి రాణికుముదిని పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొదటి విడతలో 14 జడ్పీటీసీలు, 136 ఎంపీటీసీ స్థానాల నోటిఫికేషన్ సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఇప్పటికే ఆర్‌వో, ఏఆర్‌వోలకు శిక్షణ పూర్తి చేశామని తెలిపారు. ఎంసీసీ బృందాలు అన్ని చురుగ్గా విధులు నిర్వహిస్తున్నాయన్నారు. గురువారం నోటిఫికేషన్ జారీ చేసి నామినేషన్ల స్వీకరణకు పకడ్బందీగా ఏర్పాటు చేసుకొని సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ రాజేష్‌చంద్ర, అదనపు కలెక్టర్‌లు తదితరులు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణా నిర్మూలించడం మన అందరి బాధ్యత

● జిల్లా విద్యాశాఖాధికారి రాజు



సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో రాజు

కామారెడ్డి టౌన్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): మానవ అక్రమ రవాణా నిర్మూలించడం మన అందరి బాధ్యత అని జిల్లా విద్యాశాఖాధికారి రాజు అన్నారు. బుధవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని టెక్రియాల్ కేజీబీవీ పాఠశాలలో ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ, రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ మండలి సంస్థ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ మానవ అక్రమ రవాణా అనేది ప్రపంచ వ్యాప్తంగా అత్యంత వేగంగా విస్తరిస్తూ ఎంతో మంది అమ్మాయిల జీవితాలను నాశనం చేస్తున్న నేరపూరితమైన చర్య అని అన్నారు. సైబర్ ట్రాఫికింగ్ అనేది చాలా వేగంగా విస్తరిస్తున్న జఠిలమైన సమస్య కాబట్టి పిల్లలకు ఫోన్ ఉపయోగించడం ద్వారా వచ్చే నష్టాలను తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో ఎల్లయ్య, ప్రజ్వల ఫౌండేషన్ ప్రతినిధులు సంజీవులు, కో ఆర్డినేటర్ రాము, శ్రీనివాస్, సీఆర్‌పీలు చిరంజీవి, రాములు, కాళిదాసు తదితరులు పాల్గొన్నారు.



నేడ నోటిఫికేషన్?

రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం గురువారం స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ జిల్లా స్థాయి అధికారులు జారీ చేసే అవకాశాలు కన్పిస్తున్నాయి. 42 శాతం బీసీ రిజర్వేషన్‌ల అమలును వ్యతిరేకిస్తు కొందరు హైకోర్టును ఆశ్రయించారు. బుధవారం హైకోర్టులో సుదీర్ఘంగా విచారణ కొనసాగింది. నేడు ఇచ్చే ఎన్నికల నోటిఫికేషన్‌ను వాయిదా వేయాలని పిటీషనర్లు కోరగా హైకోర్టు నిరాకరించింది. దీంతో ఎన్నికలకు లైన్‌క్లియర్ అయినట్లు న్యాయనిపుణులు చెబుతున్నారు. అయితే రిజర్వేషన్లపై కోర్టు గురువారానికి వాయిదా వేయడంతో రిజర్వేషన్లపై అదే ఉత్కంఠ కొనసాగుతోంది. అయితే ఎన్నికల కమిషన్ షెడ్యూల్ ప్రకారం మొదటి విడతలో జరగాల్సిన జడ్పీటీసీ, ఎంపీటీసీ నామినేషన్ల కోసం జిల్లా అధికారులు నోటిఫికేషన్ జారీ చేయనున్నట్లు తెలుస్తోంది.

- ఎన్నికల నోటిఫికేషన్ స్టే ఇచ్చేందుకు హైకోర్టు నిరాకరణ
- నేడు జిల్లా స్థాయిలో ఎన్నికల నోటిఫికేషన్ ఇచ్చే అవకాశం
- మొదటి విడత జడ్పీటీసీ, ఎంపీటీసీ నామినేషన్ల ప్రక్రియ
- 14 జడ్పీటీసీలు, 136 ఎంపీటీసీ స్థానాలకు నోటిఫికేషన్
- నేటికి వాయిదా పడిన రిజర్వేషన్లపై కోర్టు విచారణ
- రిజర్వేషన్లపై తొలగని ఉత్కంఠ

కామారెడ్డి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌లు కల్పించడంపై ఉత్కంఠ వీడడం లేదు. ఎన్నికలు కొనసాగుతాయా లేదా అనే దానిపై అదే అనిశ్చితి కొనసాగుతుంది. ఈ అంశం హైకోర్టు పరిధిలో ఉండడంతో ఆశావహుల్లో ఆందోళన నెలకొంది. ఎన్నికల కమిషన్ షెడ్యూల్ విడుదల చేసిన సందిగ్ధత నెలకొంటునే ఉంది. స్థానిక సమరం రాజ్యాంగ పరమైన చిక్కులతో ముడిపడి ఉన్న నేపథ్యంలో ఎన్నికలు జరుగుతాయా.. జరగవా.. ఒకవేళ నిర్వహించినా ప్రస్తుత రిజర్వేషన్లతో జరుగుతాయా లేక పాతవాటి ప్రకారం నిర్వహిస్తారా అనే చర్చ ఊపందుకుంటుంది. రిజర్వేషన్‌లపై బుధవారం హైకోర్టులో రోజంతా విచారణ జరిగినా ఎలాంటి తీర్పు రాలేదు. తీర్పును నేటికి వాయిదా వేయడంతో ఎదురుచూడక తప్పని పరిస్థితి నెలకొంది. ఈ అంశంపై స్పష్టత రావాలంటే నేటి సాయంత్రం వరకు వేచి చూడాల్సిందే. ఇదిలా ఉండగా రిజర్వేషన్‌లు అనుకూలంగా వచ్చిన వారు ఎలా ముందుకు వెళ్లాలో తెలియక అయోమయంలో ఉన్నారు.

మొదటి విడత నామినేషన్లకు నోటిఫికేషన్

రిజర్వేషన్ల అమలుపై హైకోర్టు నేటికి తీర్పును వాయిదా వేసింది. అయితే ఎన్నికల నోటిఫికేషన్‌పై ఎలాంటి స్టే ఇవ్వకుండా నిరాకరించడంతో ఎన్నికల కమిషన్ మొదటి విడత జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు నోటిఫికేషన్‌ను గురువారం జారీ చేస్తుందా లేదా చూడాలి. ఎన్నికల కమిషన్ షెడ్యూల్ ప్రకారం మండల పరిషత్ ఎన్నికలను రెండు విడతల్లో నిర్వహించాలని నిర్ణయించింది. జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ రెవెన్యూ డివిజన్‌లు ఉండగా వీటి పరిధిలో 25 మండలాలు ఉన్నాయి. మొదటి విడతలో కామారెడ్డి, ఎల్లారెడ్డి రెవెన్యూ డివిజన్ పరిధిలోని కామారెడ్డి, భిక్కనూరు, దోమకొండ, మాచారెడ్డి, పాల్వంచ, బీబీపేట, రామారెడ్డి, రాజంపేట, సదాశివనగర్, గాంధారి, తాడ్వాయి, లింగంపేట, ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేట మండలాల్లోని 14 జడ్పీటీసీ, 136 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ స్థానాలకు నామినేషన్ల ప్రక్రియ నేటి నుంచి ప్రారంభం కావాల్సి ఉంది. అయితే బీసీ రిజర్వేషన్లపై కోర్టులో ఉండడంతో ఎన్నికల కమిషన్ మొదటి విడత జడ్పీటీసీ, ఎంపీటీసీ నోటిఫికేషన్‌పై ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో చూడాలి.



రికార్డులు పరిశీలిస్తున్న గురుకుల విద్యాలయ కార్యదర్శి రమణకుమార్

విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి

కామారెడ్డి టౌన్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాల నిగురుకుల విద్యాలయ కార్యదర్శి రమణకుమార్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో నేతాజి సుభాష్ చంద్రబోస్ ఆవాస్ విద్యాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలు, ప్రగతిని ఆయన పరిశీలించారు. ఆవాస పాఠశాలలోని సరుకుల గదిని, వంట గదిని, శౌచాలయాలను పరిశీలించారు. విద్యార్థుల హాజరు మెరుగుపడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి వేణుగోపాల్, కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి నాగవేందర్ తదితరులు పాల్గొన్నారు.

వైన్స్‌లకు 57 దరఖాస్తులు

కామారెడ్డి టౌన్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వైన్స్‌లకు 57 దరఖాస్తులు వచ్చాయని ఉమ్మడి జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ సోమిరెడ్డి తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన టెండర్‌ల ప్రక్రియను ఆయన పరిశీలించారు. కామారెడ్డి స్టేషన్ పరిధిలో 12, దోమకొండ స్టేషన్ పరిధిలో 6, ఎల్లారెడ్డి స్టేషన్ పరిధిలో 3, బాన్సువాడ పరిధిలో 15, బిచ్కుంద స్టేషన్ పరిధిలో 21 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ హనుమంత్‌రావు, ఆయా స్టేషన్‌ల ఇన్స్‌పెక్టర్‌లు తదితరులు పాల్గొన్నారు.

చిన్న పిల్లలకు దగ్గు సిరప్‌ను వాడొద్దు

సదాశివనగర్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): చిన్నారులకు దగ్గు, జలుబులకు ఎలాంటి సిరప్‌లను వాడొద్దని మండల వైద్యాధికారిణి ఆస్మా తెలిపారు. ఈ మందుల వాడకంపై భారత ప్రభుత్వ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖకు చెందిన డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ పిల్లల్లో ఔషధాల సరైన వాడకం మరియు రోగుల భద్రత కోసం కొత్త మార్గదర్శకాలు జారీ చేసిందన్నారు. రెండు సంవత్సరాల లోపు పిల్లలకు దగ్గు సిరప్‌లు ఇవ్వకూడదన్నారు. కాంబినేషన్ దగ్గు, జలుబు మందులను పిల్లల్లో వాడకం పూర్తిగా నిషేధమన్నారు. నిషేధిత ఔషధాల వాడకం తక్షణం నిలిపివేయాలన్నారు. నీరు ఎక్కువగా తాగించడం, విశ్రాంతి, సహాయక చర్యలు మొదటి దశలో పాటిస్తే వాటంతట అవే తగ్గిపోతాయన్నారు. అన్ని ఆరోగ్య సంస్థలు మంచి తయారీ ప్రమాణాలు కలిగిన ఔషధాలనే వాడాలని, పీఎంపీ, ఆర్ఎంపీలు మార్గదర్శకాలు కఠినంగా పాటించాలన్నారు. నిసేధిత ఔషదాలను వాడినట్లయితే కఠిన చర్యలు తప్పవన్నారు.



పోచారం ప్రాజెక్టును పరిశీలిస్తున్న కేంద్ర బృందం అధికారులు

వరద నష్టంపై కేంద్రానికి నివేదిస్తాం

● కేంద్ర బృందం సభ్యులు

కామారెడి టౌన్/భిక్కనూరు/ఎల్లారెడ్డి రూరల్/దోమకొండ (బీబీపేట), అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి, భిక్కనూరు, ఎల్లారెడ్డి, లింగంపేట, నాగిరెడ్డిపేట, దోమకొండ మండలాల్లో కేంద్ర బృందం సభ్యులు బుధవారం పర్యటించారు. గత నెలరోజుల క్రితం భారీ వర్షాలు, వరదల వల్ల ప్రభుత్వ ఆస్తులకు తీవ్ర నష్టం వాటిల్లగా రైతుల పంటల్లో వేల ఎకరాల్లో దెబ్బతిన్నాయి. నష్టాన్ని అంచనా వేసేందుకు బుధవారం కేంద్ర బృందం జిల్లాలో పర్యటించింది. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని జీఆర్ కాలనీ వద్ద దెబ్బతిన్న బ్రిడ్జిని, అధిక వర్షాలతో దెబ్బతిన్న కామారెడ్డి ఫిల్టర్ బెడ్ పంప్‌హౌస్ క్యాజ్‌వే రోడ్డును బుధవారం కేంద్ర అధికారుల బృందం సభ్యులు హోమ్ అఫైర్స్ జాయింట్ సెక్రెటరీ నేతృత్వంలోని పీకే రాయ్, సెంట్రల్ ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్ ఎక్సిపెండీచర్స్ డిప్యూటీ డైరెక్టర్ మహేష్ కుమార్, మినిస్ట్రీ ఆఫ్ జలశక్తి శ్రీనివాసు భైరి, ఇస్రో డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్పేస్ నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ (ఎన్‌ఆర్‌సీఎస్) శశివర్ధన్‌రెడ్డి పరిశీలించారు. అనంతరం వరద నష్టంపై కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్ పరిశీలించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ తిలకించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ మాట్లాడుతూ జిల్లాలో భారీ స్థాయిలో ఆగస్టు 26,27,28 తేదీల్లో మూడు రోజుల్లోనే సంవత్సరంలో కురిసే సగటు వర్షపాతం 983.4 మి.మీలలో 40 శాతంతో 339.8 మి.మీల వర్షపాతం జిల్లా వ్యాప్తంగా కురవడంతో రహదారులు, వంతెనలు, పంటలు, ఇరిగేషన్ ట్యాంకులు, విద్యుత్ లైన్‌లు, స్తంభాలు, ఇళ్లు దెబ్బతిన్నాయని వాటిని తాత్కాలిక అత్యవసరంగా పునరుద్ధరణ చేపట్టామని కేంద్ర బృందానికి వివరించారు. భారీ వర్షాలు, వరదల వల్ల జిల్లాలో ఏర్పడిన నష్టంపై కేంద్ర ప్రభుత్వానికి నివేదిస్తామని బృందం సభ్యులు తెలిపారు. కేంద్ర బృందం వెంట జిల్లా అదనపు కలెక్టర్ విక్టర్, శిక్షణ డిప్యూటీ కలెక్టర్ రవితేజ, ఇరిగేషన్ సీఈ శ్రీనివాస్, ఆర్ అండ్ బీ ఈఈ మోహన్, జిల్లా వ్యవసాయ అధికారి మోహన్‌రెడ్డి, కామారెడ్డి మున్సిపల్ కమిషనర్ రాజేందర్ రెడ్డి, విద్యుత్ శాఖ (మిగతా 8వ పేజీలో)



సిండికేట్‌గానే టెండర్లు

- గ్రూప్ కట్టి మద్యం టెండర్లు వేస్తున్న వ్యాపారులు
- అయినా వైన్స్‌లకు అంతంత మాత్రంగానే దరఖాస్తులు
- వైన్స్ దరఖాస్తు ఫీజు రూ. 3లక్షలకు పెరగడంతో అయోమయం
- టెండర్లు వేసేందుకు డైలామాలో మద్యం వ్యాపారులు
- 13 రోజుల్లో వచ్చింది 45 దరఖాస్తులు
- 20 వైన్స్‌లకు ఒక దరఖాస్తు రాని పరిస్థితి
- ఈనెల 18 వరకు టెండర్లకు అవకాశం

కామారెడ్డి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వైన్స్‌లను దక్కించుకునేందుకు మద్యం వ్యాపారులంతా సిండికేట్‌గా మారుతున్నారు. వ్యాపారులంతా జట్టుగా కలిసి టెండర్లు వేసేందుకు సిద్ధమవుతున్నారు. ప్రభుత్వం మద్యం టెండర్ల దరఖాస్తు ఫీజు రూ.3లక్షలకు పెంచడంతో సామాన్యులు ఎవరు దరఖాస్తు చేసుకునేందుకు ముందుకురావడం లేదనే వాదన వినిపిస్తోంది. అయితే మద్యం వ్యాపారులు మాత్రం సిండికేట్‌గా మారి ఒక్కొక్కరి పేరుపై దరఖాస్తులు వేస్తున్నట్లు తెలుస్తోంది. మద్యం వ్యాపారులతో పాటు రియల్ ఎస్టేట్ వ్యాపారులు వివిధ ఉద్యోగ, రాజకీయ నాయకులు కూడా తమ అదృష్టాన్ని పరీక్షించుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు ఉండడంతో మద్యం దుకాణాలు దక్కించుకునేందుకు సిండికేట్‌లుగా మారి టెండర్లు వేస్తున్నట్లు తెలుస్తోంది. అయితే దరఖాస్తు ఫీజు ఎక్కువగా ఉండడంతో ఇతర వర్గాల వారు ముందుకు రావడం లేదు. 13 రోజుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నప్పటికీ ప్రస్తుతం 45 మాత్రమే వచ్చాయి. చివరి మూడు రోజుల్లో దరఖాస్తుల సంఖ్య పెరిగే అవకాశం ఉంటుందని ఎక్సైజ్‌శాఖ అధికారులు చెబుతున్నారు.

టెండర్లపై వ్యాపారుల డైలామా

రాష్ట్ర ప్రభుత్వం కొత్త మద్యం పాలసీని ఖరారు చేసిన నేపథ్యంలో వ్యాపారులు టెండర్లు వేయాలా వద్ద అనే డైలామాలో పడిపోయారు. దరఖాస్తు ఫీజు భారీగా పెంచడంతో ఈ పరిస్థితి నెలకొంటున్నట్లు తెలుస్తోంది. 2023-24 సంవత్సరానికి గాను టెండర్లు వేసిన చాలా మంది నష్టాలు చవి చూశారు. గతంలో 2 లక్షలుగా ఉన్న దరఖాస్తు ఫీజును రూ.3లక్షలకు పెంచింది. దీంతో ముందుకు వెళ్లాలా వద్దా అనే ఆలోచనలో పడుతున్నారు. రెండేళ్ల క్రితం వరకు వైన్స్‌షాపులు దక్కించుకున్నవారు లాభాలు రావడంతో 2023 ఆగస్టులో నిర్వహించిన టెండర్లలో రెగ్యులర్ (మిగతా 8వ పేజీలో)

దళారుల ఆగడాలకు అడ్డుకట్ట వేసేదెవరు?

- లక్షల్లో ప్రభుత్వ ఆదాయానికి గండి
- జోరుగా హద్దులు దాటుతున్న పచ్చి దాన్యం
- యాసంగి బోనస్ లేక, ప్రకృతి వైపరీత్యాల దృష్ట్యా దళారుల వైపు మొగ్గు చూపుతున్నరైతులు

7

స్థానిక ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

- ఎన్నికల ప్రవర్తన నియమావళిని పాటించాలి
- పోలీస్ కమిషనర్ వెల్లడి

7





వెల్లుట్లలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ఎల్లారెడ్డి రూరల్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి మండల పరిధిలోని వెల్లుట్ల గ్రామంలోని పల్లె దవాఖానలో బుధవారం స్థానికులకు ఆరోగ్య సంరక్షణ గురించి అవగాహన కల్పించినట్లు ఎంఎల్‌హెచ్‌పీ జ్యోతి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, వర్షాకాలంలో దోమల బెడద ఎక్కువగా ఉంటుందన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, మురుగు నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్త వహించాలని గ్రామస్థులకు సూచించారు. పోషకాహారం తీసుకుంటూ దృఢంగా ఉండాలన్నారు. స్వల్ప అనారోగ్యానికి గురైన వారికి పరీక్షలు చేసి మందులను అందించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌ఎంఎల్ ఇందిరా, ప్రమీల, ఆశావర్కర్ హసీనా, గ్రామస్థులు పాల్గొన్నారు.



రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు రిపుల్స్ విద్యార్థులు

బిచ్కుంద, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు బిచ్కుంద మున్సిపాలిటీ పరిధిలోని రిపుల్స్ పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. బుధవారం నెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీధర్, కార్యదర్శి రఘురాంల ఆధ్వర్యంలో బీర్కూర్ మండలంలోని జ్యోతిబాపూలే క్రీడా ప్రాంగణంలో నెట్‌బాల్ ఎంపిక జరిగింది. కాగా రిపుల్స్ పాఠశాలకు చెందిన భూమిక 7వ తరగతి, అక్షర 9వ తరగతి, సంపద 9వ తరగతి, పండరి 8వ తరగతి విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ఎంపికైనట్లు వ్యవస్థాపకుడు అనిల్‌కుమార్ పాటిల్ తెలిపారు.

క్రైం సమాచారం

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

బోధన్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలోని జూనియర్ కాలేజ్ గ్రౌండ్ ఎదురుగా ఉన్న రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే బోధన్ మినార్‌పల్లి గ్రామానికి చెందిన సృజన్ ద్విచక్ర వాహనంపై వస్తూ సైకిల్‌పై వెళ్తున్న రాకాసిపేట్‌కు చెందిన అబ్దుల్ రసీద్‌ను ఢీకొట్టాడు. దీంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించిన 108కు సమాచారం అందించగా 108 సిబ్బంది లక్ష్మణ్, జావీద్‌లు గాయపడిన వ్యక్తులను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో జిల్లా ఆసుపత్రికి తరలించారు.

కూలీ మృతిపై కేసు నమోదు

నవీపేట,అక్టోబరు8(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోస్లీ పంచాయతీ పరిధిలోని ఫకీరాబాద్‌లో మంగళవారం మృతి చెందిన కల్లెపల్లి వెంకటేశ్వర్లు(49)అనే కూలీ మృతిపై బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తిరుపతి తెలిపారు. ఖమ్మం జిల్లా కారేపల్లికి చెందిన వెంకటేశ్వర్లు ఫకీరాబాద్ సమీపంలో జరుగుతున్న రైల్వే డబ్లింగ్ పనులలో కూలీ పని చేయడానికి మరికొంత మందితో కలిసి మంగళవారం ఫకీరాబాద్‌కు వచ్చాడు. సాయంత్రం అతడు మృతి చెందాడు. అతిగా మద్యం సేవించి మృతి చెందాడా, మరే ఇతర కారణాలతో మృతి చెందాడా అనే విషయం పోస్టుమార్టంలో తేలుతుందన్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఇసుక అక్రమ రవాణా చేస్తున్న వాహనం పట్టివేత



డోంగ్లి మండలంలో అక్రమ ఇసుక రవాణా చేస్తున్న వాహనం పట్టుకున్న ఆర్‌ఐ

మద్నూర్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : డోంగ్లి మండలంలోని ప్రభుత్వానికి సంబంధించిన టిఎస్ఎండిసి ఇసుక క్వారీ నిల్వ ఉంచి న డంపులో నుండి అక్రమంగా బొలెరో వాహనంలో లోడ్ చేసుకొని కుర్ల గ్రామం వైపు వెళ్తుండగా డోంగ్లి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సాయి బాబా వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా ఎలాంటి అ నుమతి పత్రాలు లేకపోవడంతో సంబంధిత యజమాన్ని విచారించి ఎలాం టి పత్రాలు లేవని తెలుపడంతో ఆ వాహనాన్ని డోంగ్లి గ్రామంలో పట్టుకొని సంబంధిత తహసిల్దార్ కార్యాలయం నందు తదుపరి చర్య కొరకు సేఫ్ కస్టర్డీ ఉంచడం జరిగింది.

ఏఎస్సై గంగాప్రసాద్‌కు ఎస్సైగా పదోన్నతి



సీపీ చేతుల మీదుగా ఎస్సైగా పదోన్నతి పొందుతున్న గంగాప్రసాద్ దృశ్యం

బోధన్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): బోధన్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఎటాచ్డ్ ఏఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న గంగాప్రసాద్‌కు బుధవారం ఎస్ఐగా పదోన్నతి లభించింది. ఈ సందర్భంగా సీపీ సాయి చైతన్య గంగాప్రసాద్‌కు ఎస్ఐగా పదోన్నతి లభించడంతో అభినందించారు. ఎస్ఐగా పదోన్నతి పొందిన గంగాప్రసాద్ ఆదిలాబాద్ జిల్లాకు ఎస్ఐ పోస్టింగ్‌పై వెళ్లనున్నారు. బోధన్ పట్టణానికి చెందిన గంగాప్రసాద్‌ను బోధన్ పట్టన ప్రముఖులు, పలువురు అభినందించారు.

రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు

● తహసీల్దార్ దత్తాద్రి



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్ దత్తాద్రి

ఎడపల్లి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): నాణ్యతా ప్రమాణాలకు లోబడి ఉన్న ధాన్యానికి ఎలాంటి తరుగు, కోతలు లేకుండా రైతుకు పూర్తి స్థాయిలో మద్దతు ధర దక్కేలా చూడాలని, రైతులు తాము పండించిన వరి పంటను దళారులకు అమ్మి మోసపోవద్దని, కొనుగోలు కేంద్రాలకు తరలించి మద్దతు ధరను పొందాలని ఎడపల్లి తహసీల్దార్ దత్తాద్రి అన్నారు. బుధవారం ఎడపల్లి మండల కేంద్రంలోని ఇందిరా క్రాంతి భవన కార్యాలయం ఎదుట ఐకేపీ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులు ముందుగానే వరి దాన్యంలో తాలు, మట్టి బెడ్డలు లేకుండా చూసుకోవాలన్నారు. కొనుగోలు కేంద్రం నిర్వాహకులు ముందుగానే వరి ధాన్యాన్ని పరిశీలించి రైతులను చైతన్య పరచాలన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలన్నారు. మిల్లర్లతో మాట్లాడి రైతులకు నష్టం వాటిల్లకుండా పంపిన వరి ధాన్యాన్ని త్వరగా లోడింగ్, మిల్లులో అన్‌లోడ్ అయ్యే విధంగా చూడాలన్నారు. కొనుగోలు కేంద్రానికి కావలసిన వాటిని వెంటనే సమకూర్చు కోవాలన్నారు. రైతులు అందరూ తాము పండించిన వరి పంటను కొనుగోలు కేంద్రాలకు తరలించాలని ఆయన కోరారు. ఎడపల్లి మండల కేంద్రంతో పాటు మంగల్‌పాడ్, ఠాణాకలాన్, వడ్డాపల్లి, ధర్మారం, దుబ్బతాండా తదితర గ్రామాల్లో దాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినట్లు ఏపీఎం రాజేందర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఐకేపీ ఏపీఎం రాజేందర్, సీసీలు సాయిలు, భాస్కర్, మండల సమాఖ్య అధ్యక్షురాలు, సభ్యులు ఉన్నారు.

బోధన్‌లో విద్యార్థి సంఘాల జేఏసీ ఏర్పాటు

బోధన్,అక్టోబరు8(ఆంధ్రజ్యోతి): బోధన్ డివిజన్ పరిధిలోని విద్యారంగ సమస్యలపై పోరాటం నిర్వహించాలని భావించి అన్ని విద్యార్థి సంఘాలు ముఖ్య నాయకులు బుధవారం బోధన్ పట్టణంలోని పీఆర్‌టీయూ భవన్‌లో సమావేశం ఏర్పాటు చేసుకుని ఏకగ్రీవంగా విద్యార్థి సంఘాల జేఏసీని ఏర్పాటు చేశారు. విద్యార్థి సంఘాల జేఏసీ చైర్మన్‌గా విద్యార్థి సంఘాల నాయకులు డీ.నాగరాజు, కన్వీనర్‌గా గౌతం కుమార్, కోకన్వీనర్‌గా సంజయ్ తలారే, మౌనిక, ప్రశాంత్, ప్రచార కార్యదర్శి మొహిసిన్, కమిటీ సభ్యులుగా వినోద్, శ్రీకాంత్, సంతోష్, బాలరాజు, ప్రతాప్, రాజు, రాజేందర్, కిరణ్, సతీష్, జీవన్, మోహన్, రాజన్న, సాయినాథ్, మంగేష్, నాగేంద్ర తదితరులు సభ్యులుగా ఉన్నారు.

వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం

రుద్రూరు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని అంబం(ఆర్), సిద్దాపూర్, రుద్రూర్ గ్రామాలలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం తహసీల్దార్ తారాబాయి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యానికి మద్దతు ధర కల్పించడానికి ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తుందని అన్నారు. రైతులు తమ ధాన్యాన్ని దళారులకు విక్రయించి నష్టపోకుండా కొనుగోలు కేంద్రాలలో విక్రయించి మద్దతు ధర పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు ద్రౌపతి, ఏపీఎం బస్వంత్ రావు, సీసీ గంగారాం, వీఓఏ లావణ్య, స్వరూప, రైతులు తదితరులు పాల్గొన్నారు.



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

కాంగ్రెస్ బాకీ కార్డులను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

» బీఆర్ఎస్ కార్యకర్తలకు ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి దిశా నిర్దేశం



వేల్పూర్‌లో కాంగ్రెస్ బాకీ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి



అంబేద్కర్ చౌరస్తా వద్ద కాంగ్రెస్ బాకీ కార్డులను పంపిణీ చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

వేల్పూర్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పాలనపై ప్రజలు అసంతృప్తిగా ఉన్నారని, ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని బాకీ ఉన్న హామీలను కాంగ్రెస్ బాకీ కార్డు రూపంలో ప్రజలందరికి విస్తృతంగా చేరవేయాలని బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి పార్టీ కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. వేల్పూర్ మండల కేంద్రంలోని కేసీఆర్ కాలనీలో బుధవారం జరిగిన మండలస్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి కాంగ్రెస్ బాకీ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం నయవంచక హామీలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు కాంగ్రెస్ బాకీ కార్డ్ ఉద్యమంలో బాల్కొండ నియోజకవర్గం వ్యాప్తంగా విస్తృతంగా చేపడతామని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన 420 హామీలను పూర్తిగా మోసం చేసిందని విమర్శించారు. కాంగ్రెస్ మోసపూరిత వైఖరిని బయటపెట్టడానికి బీఆర్ఎస్ పార్టీ బాకీకార్డ్ రూపంలో ప్రజల్లో తీసుకువస్తుందన్నారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే హామీలన్ని అమలు చేస్తామని కాంగ్రెస్ నాయకులు ఎన్నికల్లో ప్రతీ వేదికలో చెప్పారన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 22 నెలలు కావస్తున్నప్పటికీ ఏ ఒక్క అమలు సక్రమంగా అమలు చేయలేదన్నారు. పథకాల అమలు త క్కువ ప్రచారం ఎక్కువ అన్న తీరునా కాంగ్రెస్ పార్టీ పాలన సాగుతుందన్నారు. ప్రజలకు కాంగ్రెస్ పార్టీ ఏ విధంగా గ్యారంటీ కార్డులు ఇచ్చి మోసం చేసిందో ప్రజలకు వివరిస్తామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేస్తే ఆ ఓట్లు మురిగి పోతాయన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీ రెండు కలిసి పనిచేస్తున్నాయన్నారు. కాంగ్రెస్ పార్టీని రేవంత్‌రెడ్డితో ప్రజల పక్షాన నిలదీసి కొట్లాడేది బీఆర్ఎస్ మాత్రమే అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఒక్కొక్క పథకం ద్వారా ప్రజలకు ఎంతో బాకీ పడిందన్నారు. ఇప్పటి వరకు పెళ్లిల్లు అయిన ఆడబిడ్డలకు తులం బంగారాం, విద్యార్థులకు స్కూటీలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ 8 వేల కోట్లు, విద్యార్థులకు 2 లక్షల ఉద్యోగాలు, 22 నెలలుగా ఇవ్వని నిరుద్యోగ భృతి 88 వేలు, ఉపాధి హామీ కూలీలకు, ఆటో డ్రైవర్లకు సంవత్సరానికి రూ.12వేల చొప్పున రెండేళ్లకు 24వేలు కాంగ్రెస్ పార్టీ బాకీ పడ్డదన్నారు. 22 నెలలుగా వృద్ధులకు, బీడీ పెన్షన్‌దారులకు 44వేలు కాంగ్రెస్ పార్టీ బాకీ పడిందన్నారు. ప్రతీ ఒకరానికి 12వేల 500 చొప్పున నాలుగు పంటలకు 50వేలు రైతుకు కాంగ్రెస్ పార్టీ బాకీ పడిందాన్నరు. బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఈ రెండేళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం వివిధ పథకాల ద్వారా ప్రజలకు ఎంత బాకీ పడిందో తెలిపేలా కాంగ్రెస్ బాకీకార్డ్‌లను పంచుతామన్నారు. ఈ కార్యక్రమంలో బాల్కొండ నియోజకవర్గంలోని వివిధ మండలాల బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్‌లో..

పెర్కిట్ : ఆర్మూర్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద బుధవారం బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ బాకీ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు పూజా నరేందర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి 24 నెలలు పూర్తయిందని కాంగ్రెస్ పార్టీ ఎన్నికలలో ఇచ్చిన హామీలను ఇంతవరకు నెరవేర్చలేదని ఆ హామీలకు సంబంధించిన బాకీ కార్డులను పంపిణీ చేస్తున్నట్లుగా తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలు వెంటనే నెరవేర్చాలని లేకపోతే కాంగ్రెస్ నాయకులను నిలదీస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్వసమాజ్ అధ్యక్షుడు సుంకరి రవి, మాజీ వైస్ ఎంపీపీ గంగాధర్, ఆర్మూర్ పీఏసీఎస్ వైస్ చైర్మన్ నర్మే నవీన్, ఎస్సీసెల్ టౌన్ అధ్యక్షుడు జన్నపల్లి రంజిత్, గుంజల పృథ్వీరాజ్, అగ్గు క్రాంతి, శ్రావణ్, ఇందూర్ విజయ్, హర్షత్, లతీఫ్, రషాద్ తదితరులు పాల్గొన్నారు.

రైతులు ప్రమాదాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

ముప్కాల్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): రైతులు తమ పంట పొలాల వద్ద విద్యుత్ ప్రమాదాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని విద్యుత్ లైన్ ఇన్‌స్పెక్టర్ నర్సయ్య సూచించారు. బుధవారం బాల్కొండ మండల కేంద్రంలో రైతు పొలంబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రైతులకు సూచనలు చేశారు. పొలాల మధ్య ఉన్న మోటర్లు, స్టాటర్లు, పీవీసి పైపులు ఉండేలా చూసుకోవాలని ప్రతీ విద్యుత్ వస్తువు తప్పనిసరి యర్తింగ్ చేయాలని సూచించారు. ఈ లో వోల్టేజ్ సమస్య రాకుండా విద్యుత్ మోటార్లకు కెపాసిటీలను అమర్చుకోవాలని కోరారు. ఏదైనా విద్యుత్ సమస్యలు ఉంటే విద్యుత్ సిబ్బందికి తెలిజేయాలన్నారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ల ఫ్యూజులను రైతులు మార్చవద్దని సూచించారు. ఎటువంటి విద్యుత్ సమస్యలు తలెత్తిన విద్యుత్ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 1912 ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో లైన్‌మన్ మల్లేష్, గంగాధర్, యాదగిరి, గణపతి, రమేష్, సోమయ్య, రైతులు పాల్గొన్నారు.

మోర్తాడ్‌లో దళిత సంఘాల రాస్తారోకో



మోర్తాడ్‌లో రాస్తారోకో చేస్తున్న దళిత సంఘాల సభ్యులు

మోర్తాడ్ , అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జాతీయ రహదారి పై బుధవారం దళిత బహుజన సంఘాలు, అంబేద్కర్ సంఘాల ఆధ్వర్యంలో ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. సుప్రీం కోర్టు జస్టిస్ బి.ఆర్ గవాయిపై దాడిని తీవ్రంగా ఖండిస్తు నినాధాలు చేశారు. దాడి చేసిన రాకేష్ కిషోర్‌ను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అనంతరం మండల తహసీల్దార్ కృష్ణకు మెమోరాండం సమర్పించారు. ఈ కార్యక్రమంలో బహుజన సంఘాల సభ్యులు, అంబేద్కర్ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించడమే లక్ష్యం

● సీజీఆర్ఎఫ్ చైర్మన్ ఎరుకల నారాయణ



జన్నేపల్లిలో మాట్లాడుతున్న సీజీఆర్ఎఫ్ చైర్మన్ నారాయణ

నవీపేట, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించడమే తమ లక్ష్యమని టీజీఎన్‌పీడీసీఎల్ నిజామాబాద్ సీజీఆర్ఎఫ్-2 చైర్‌పర్సన్ ఎరుకల నారాయణ అన్నారు. బుధవారం మండలంలోని జన్నేపల్లి 33/11 సబ్ స్టేషన్ ఆవరణలో జరిగిన విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదికలో కేవలం మండలంలోని యంచకు చెందిన రంజిత్ అనే వ్యక్తి ఒకే ఒక వినియోగదారుడు హాజరు కావడం పట్ల సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంపై ఎందుకు సరిగా ప్రచారం నిర్వహించలేదని సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వినియోగదారులే తమకు నిజమైన దేవుళ్లు అని వారికి సేవలు అందించడమే సిబ్బంది కర్తవ్యం అని ఆయన పేర్కొన్నారు. విద్యుత్ లైన్‌లు, సబ్ స్టేసన్‌ల నిర్వహణ వంటి పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సిబ్బందిని ఆదేశించారు. విద్యుత్ శాఖకు సంబంధించిన గణాంక వివరాలను సిబ్బంది సరిగా వివరించకపోవడం పట్ల ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. యంచకు చెందిన వినియోగదారుడి సమస్యను వారం రోజుల్లో పరిష్కరించి తనకు సమాచారం అందించాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ సభ్యుడు రామకృష్ణ, ఫైనాన్స్ సభ్యుడు లకవత్ కిషన్, డీఈ శ్రీనివాస్, ఏడీఈ ప్రశాంత్ రెడ్డి, జన్నేపల్లి ఏఈ శ్రీనివాస్, లైన్‌మెన్‌లు, సహాయ లైన్‌మెన్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఉన్నత ఉద్యోగాలు సాధించాలి



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న దృశ్యం

బోధన్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులు ఉత్తీర్ణత సాధించి ఉన్నత ఉద్యోగాలు సాధించాలని మధుమలాంచ ప్రభుత్వ పాఠశాల పూర్వ విద్యార్థి వీవీఎస్ రెడ్డి అన్నారు. బుధవారం బోధన్ పట్టణంలోని శక్కర్‌నగర్‌లోని మధుమలాంచ పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం లక్ష 25వేల రూపాయల గల విద్యార్థులకు డ్యూయల్ డెస్క్ బెంచీలను అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. తాను కూడా మధుమలాంచ పాఠశాలలోనే చదివి నేడు ఈ స్థాయికి చేరుకున్నానన్నారు. ప్రస్తుత విద్యార్థులు బాగా చదివి ఉత్తీర్ణత సాధించి ఉన్నతమైన ప్రభుత్వ ఉద్యోగాలు సంపాదించి తల్లిదండ్రులకు, పాఠశాలలకు మంచిపేరు తెచ్చి పెట్టాలన్నారు. అనంతరం ప్రిన్సిపాల్ నరేందర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలకు చేయూతనందించిన వీవీఎస్ రెడ్డికి అభినందించారు. తాను చదువుకున్న పాఠశాలకు సహాయం చేయడం అభినందనీయమన్నారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ

ఆర్మూర్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): లయన్స్‌క్లబ్ ఆఫ్ ఆర్మూర్ గ్రీన్ ఆధ్వర్యంలో బుధవారం గాంధీ నగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు నోట్‌పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ఆఫ్ ఆర్మూర్ గ్రీన్ అధ్యక్షుడు ఆకు రాజు, కోశాధికారి గోపికృష్ణ, సభ్యులు అల్జాపూర్ రాజేష్, బాలాజీరావు, మాదవరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



నోట్ పుస్తకాలు అందజేస్తున్న లయన్స్ సభ్యులు

పాఠశాలకు జిరాక్స్ ప్రింటర్ అందజేత



పాఠశాలకు జిరాక్స్ ప్రింటర్‌ను అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

జక్రాన్‌పల్లి , అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని తొర్లికొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు బుధవారం జిరాక్స్ ప్రింటర్‌ను పూర్వ విద్యార్థులు వితరణగా ఇచ్చారు. అనంతరం పాఠశాలలో ఎంఈవో శ్రీనివాస్‌కు జిరాక్స్ ప్రింటర్‌ను 1994-95 సంవత్సరం పదవ తరగతి పూర్వ విద్యార్థులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యంచ మహాలక్ష్మి ఆలయానికి విరాళం



యంచ మహాలక్ష్మి ఆలయానికి ఫ్లడ్‌లైట్లు విరాళంగా అందజేస్తున్న దృశ్యం

నవీపేట, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని యంచ మహాలక్ష్మి ఆలయానికి బుధవారం పలువురు విరాళం అందజేశారు. ఆలయ ప్రాంగణంలో షెడ్డు నిర్మాణానికి నందిగామకు చెందిన సంజీవ్ 50వేలు, యంచకు చెందిన ధర్మాజీ 10వేలు, లాలు 10వేలు, అరవింద్ 5వేలు, సిందే రాజు రెండు ఫ్లడ్‌లైట్లను ఆలయానికి విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో వీడీసీ సభ్యులు భూమన్న, విజయ్ కుమార్, సాయిలు తదితరులున్నారు.



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ అభిజ్ఞాన్ మాల్వియా

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించాలి

● సబ్ కలెక్టర్ అభిజ్ఞాన్ మాల్వియా

ఆర్మూర్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని ఆర్మూర్ సబ్ కలెక్టర్ అబిజ్ఞాన్ మాల్వియా అన్నారు. బుధవారం ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్‌లోని ఎంఆర్ గార్డెన్‌లో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో విధులు నిర్వహించనున్న ప్రెసిడింగ్ అధికారులకు అధికారులు, అసిస్టెంట్ ప్రొసిడింగ్ అధికారులకు డివిజన్ స్థాయిలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లడుతూ ప్రజాస్వామ్య దేశంలో ఎన్నికలు కీలకమని విజయవంతం కావాలంటే ఎన్నికలు సజావుగా సాగాలన్నారు. ఎన్నికల్లో విధులు నిర్వహించనున్నా అధికారులు నిబంధనల ప్రకారం విధులు నిర్వర్తించి ఎలాంటి లోపాలకు తావివ్వకుండా ఎన్నికల నిర్వహణ పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పీ డిప్యూటి సీఈవో సాయన్న, డీఎల్‌పీవో శివకృష్ణ, ఆర్మూర్ , భీమ్‌గల్, ఆలూర్, బాల్కొండ ఎంపీడీవోలు శివాజీ, సంతోష్ కుమార్, గంగాధర్, విజయభాస్కర్ రెడ్డి, ఎంపీవో శ్రీనివాస్, ఎంఈవో రాజగంగారాం, ఆర్పీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న ఏఐయూకేఎస్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు

ఆర్మూర్ టౌన్ , అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మొక్కజొన్న, ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని అఖిల భారత ఐక్య రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు వి.ప్రభాకర్, బి.దేవరాం డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని కుమార్ నారాయణ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికల్లో సీఎం రేవంత్ రెడ్డి వరంగల్ డిక్లరేషన్‌లో రైతాంగానికి అన్ని పంటలకు రూ.500 బోనస్ ఇస్తానని, రెండులక్షల రుణమాఫీ చేస్తానని, ప్రతీ పంటను కొనుగోలు చేస్తామని హామి ఇచ్చి ఏ ఒక్క వాగ్దానాన్ని వందశాతం పూర్తి చేయలేదన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం మొక్కజొన్న, వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐయూకేఎస్ జిల్లా అధ్యక్షుడు ఎస్.సురేష్, కార్యదర్శి బి. కిషన్, నాయకులు యు. రాజన్న, ఆకుల గంగారాం, జక్కం శేఖర్, జి. కిషన్, తదితరులు పాల్గొన్నారు.

ఏర్గట్ల: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం మండలంలోని రైతులు మొక్కజొన్న, సోయాబీన్ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరుతూ తహసీల్దార్ మ ల్లయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ రైతులు కష్టపడి పండించిన పంటను దళారులకు అమ్ముకొని 400 నుంచి 500 వరకు నష్టపోవాల్సి ఉంటుందని, ప్రభుత్వం స్పం దించని యెడల పెద్ద ఎత్తున ఆందోళన చేపడాతమన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని రైతులు పాల్గొన్నారు.



తహసీల్దార్ మల్లయ్యకు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

మక్కలకు మద్దతు ఇచ్చి కొనుగోలు చేయాలి

ఆర్మూర్ టౌన్ , అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన మక్కలకు 2400 రూపాయలు మద్దతు ధర ఇచ్చి రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేయలని టిడిపి జిల్లా పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షుడు దేగాం యాదాగౌడ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాంగ్రెస్ పార్టీ రైతు డిక్లరేషన్ లో ఇచ్చిన మద్దతు ధర ప్రకారం మార్క్‌ఫైడ్ ద్వారా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేపి మక్కలను కొనుగోలు చేయాలని అన్నారు. పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ జిల్లా వాసి అయినందున మొదటగా జిల్లాకు న్యాయం జరగాలని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పక్షాన నిలబడకుండా రాజకీయాలు మాట్లాడుతున్నారని వాతావరణ పరిస్థితుల వల్ల రైతులు భయాందోళనతో దళారుల వద్ద మోసపోతున్నారని అన్నారు. రైతులను ఆదుకోలేని పక్షంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ది చెప్తారని హెచ్చరించారు.

మద్యం దుకాణాలకు రెండు దరఖాస్తులు

భీమ్‌గల్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నూతన మద్యం దుకాణాలకు వెలువరించిన నోటిఫికేషన్ లో భాగంగా బుధవారం భీమ్‌గల్ పట్టణ కేంద్రంలో రెండు దరఖాస్తులు నమోదయినట్లు ఎక్సైజ్ సీఐ వేణుమాధవ్ తెలిపారు. వీటిలో ఒకటి జనరల్ కేటగిరిగా కాగా, మరొకటి గౌడ విభాగంలో నమోదైనట్లు ఆయన తెలిపారు. ఆసక్తి గల వారు ప్రభుత్వం నిర్ణయించిన సమయంలోపు దరఖాస్తు చేసుకోవాలని సీఐ తెలిపారు.

ఫొటో న్యూస్



సాయంత్రం సమయంలో అస్తమిస్తున్న సూరీడు

సంధ్యా సమయంలో జలంలో అరుణ కాంతులు

ప్రకృతి ఎప్పుడు కొత్తదనంతో తన రూపు రేఖలను చూపుతుంటుంది. ఒక్కో ప్రాంతంలో ఒక్కో రకంగా తన వర్ణాన్ని ప్రదర్శిస్తుంది. పొద్దంతా సూరీడు సుర్రుమనిపించి సాయంత్రం వేళ గుట్టల మాటున ఒడిలోకి ఒదిగి పోతూ ఉండగా, సూర్య కిరణాలు అరుణవర్ణంగా మారి ఆకాశంతో పాటు జలంలో అరుణ వర్ణాన్ని చాటాయి. దీంతో బుధవారం సాయంత్రం మండలంలోని ఓ చెరవులో ఆకాశంతో పాటు నీరు అరుణ వర్ణంలోకి మారింది. ఈ దృశ్యాన్ని ఆంధ్రజ్యోతి క్లిక్‌మనిపించింది.

●(ఆంధ్రజ్యోతి, పెద్దకొడపగల్)

స్థానిక ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

» ఎన్నికల ప్రవర్తన నియమావళిని పాటించాలి

» పోలీస్ కమిషనర్ వెల్లడి

ఇందూరు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా స్థానిక సంస్థల ఎన్నికలను పకడ్బందీగా, ప్రశాంతంగా నిర్వహించాలని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య, అధికారులను ఆదేశించారు. ఇతర శాఖలతో సమన్వయం చేసుకుంటూ ఎన్నికల ప్రక్రియను సజావుగా పూర్తి చేయాలని సూచించారు. బుధవారం పోలీస్ కార్యాలయంలోని కమండ్ కంట్రోల్ హల్‌లో పోలీసు అధికారులతో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు.



సమావేశంలో పాల్గొన్న పోలీసు సిబ్బంది



మాట్లాడుతున్న సీపీ సాయిచైతన్య

ఎన్నికల కోడ్ అమలు, ఏర్పాట్లు

ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో తక్షణం ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిందని తెలిపారు. అక్టోబర్ 9న ఎన్నికల నోటిఫికేషన్ విడుదలవుతుందని, నవంబర్ 11 వరకు ఎన్నికల ప్రక్రియ పూర్తి కానుందని వివరించారు.

ఎలక్షన్ సెల్ ఏర్పాటు

కమిషనరేట్ కేంద్రంలో ఎలక్షన్ సెల్ ఏర్పాటు చేస్తున్నామని, దీనికి అనుభవజ్ఞులైన అధికారులను, సిబ్బందిని కేటాయించామని తెలిపారు. ఈ సెల్ కమిషనరేట్ వ్యాప్తంగా అధికారులకు సమన్వయకర్తగా వ్యవహరిస్తుందన్నారు.

అంతర్ జిల్లా అంతర్ రాష్ట్ర చెక్ పోస్టులు

అతి త్వరలో అంతర్ జిల్లా అంతర్ రాష్ట్ర చెక్ పోస్టు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నా మని, ఈ చెక్ పోస్టుల వద్ద ముమ్మర వాహన తనిఖీలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

బైండోవర్

గత ఎన్నికల సంఘటనలను దృష్టిలో ఉంచుకుని, ఎన్నికల నేరస్థులను, రౌడీ షీటర్లను ఆయా రెవెన్యూ అధికారుల ముందు బైండోవర్ చేయాలని సూచించారు.

నగదు పరిమితి

సరైన ఆధారాలు లేకుండా రూ.50 వేల కంటే ఎక్కువ నగదును వెంట తీసుకువెళ్లరాదని, ఈ నిబంధన ఉల్లంఘిస్తే ఆ మొత్తాన్ని సీజ్ చేయాలని సీపీ ఆదేశించారు.

● నామినేషన్ల స్వీకరణ నుంచి ఎన్నికల నిర్వహణ పూర్తయ్యే వరకు అధికారులు అప్రమత్తంగా ఉండి తమ విధులను సమర్థవంతంగా నిర్వర్తించాలని సీపీ సూచించారు. ఎన్నికల హ్యాండ్ బుక్‌లోని ప్రతీ అంశంపై అవగాహన పెంచుకోవాలని, అనుమానాలు ఉంటే ఉన్నతాధి కారులను సంప్రదించి నివృత్తి చేసుకోవాలని తెలిపారు. ఫ్లైయింగ్ స్క్వాడ్‌కు కేటాయించే పోలీసు అధికారులకు అవసరమైతే శిక్షణ కూడా అందిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో అదనపు డీసీపీ (అడ్మిన్) జి.బస్వారెడ్డి, నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ ఏసీపీలు రాజా వెంకటరెడ్డి, శ్రీని వాస్, వెంకటేశ్వర్లు, సిసిఆర్బిసిఐ సతీష్, ఎలక్షన్ సెల్ సీఐ వీరయ్య, సీఐలు, ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.



నదిలో కొట్టుకుపోతున్న వ్యక్తిని రక్షించిన పోలీసులు

భళా.. బాన్సువాడ పోలీసులు

● మంజీరా నదిలో దూకి వ్యక్తి ఆత్మహత్యా యత్నం

● కాపాడిన బాన్సువాడ పోలీసులు

బాన్సువాడ టౌన్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): నదిలో దూకి ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నించిన ఓ వ్యక్తిని కాపాడి భళా బాన్సువాడ పోలీసులు అనిపించుకున్నారు. మద్నూర్ మండలం శేఖాపూర్ గ్రామానికి చెందిన బడిగే రఘునాథ్ బాన్సువాడ పరివాహక ప్రాంతంలో నిమంజీరా నదిలో దూకి ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నించాడు. మంజీరా బ్రిడ్జిపై నుంచి నదిలోకి దూకాడు. అక్కడున్న వారు వెంటనే 100 డయల్ ద్వారా పోలీసులకు సమాచారం అందించారు. స్పందించిన పోలీసులు శంకర్, పవన్ , సతీష్ , ఆనంద్‌లు మద్దెల్‌చెరువు సమీపంలోని మంజీరా నది తీరం వెంట వెళ్లారు. నదిలో కొట్టుకుపోతున్న రఘునాథ్‌ను పోలీసులు సాహసం చేసి కాపాడారు. అక్కడి నుండి రఘునాథ్‌ను స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించి వైద్యపరీక్షలు చేయించారు. ఆరోగ్యం నిలకడగా ఉండడంతో పోలీసులు ఆయనను కుటుంబ సభ్యులకు అప్పగించారు. పోలీసులు సాహసం చేసి ప్రాణం కాపాడారని , భళా బాన్సువాడ పోలీసులని ప్రజలు ప్రశంసలతో ముంచెత్తుతున్నారు.

అందుబాటులో శనగ విత్తనాలు

పెద్ద కొడప్‌గల్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): రా నున్న రబీ సీజన్‌కు గాను రైతన్నలు ఆరుతడి పంట లో భాగంగా సాగుచేసేందుకు అందుబాటులో శనగ విత్తనాలున్నాయని సహకార సంఘం సీఈవో సం దీప్ తెలిపారు. మండలం లో రబీ సీజన్‌కు గాను రైతన్నలు ఆరుతడి పంట కింద అధిక మొ త్తంలో శనగ పంట సాగు చేస్తారని, రైతుల సౌకర్యార్థం శనగ విత్తనాలు అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు. జెజి 11 రకంకు సంబంధించిన విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. 25 కేజిల బస్తా ధర 20 85 రూపాయలుగా ఉందని, అ వసరం ఉన్న రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డుతో సహకార సంఘంలో సంప్రదించాలని సూచించారు. ఈ శనగ విత్తనాలపై ఎలాంటి రాయితీ లేదని పేర్కొన్నారు

తప్పుల తడకగా ఓటరు జాబితా

మద్నూర్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) స్థానిక సం స్థల ఎన్నికల కోసం సిద్ధం చేసిన ఓటరు జాబితాలో మరణించిన వారి పేర్లు, అలాగే ఉండగా ఒక్కొక్కరి పేర్లు రెండు మూడు సార్లు ఉన్నట్లు మాజీ ఎంపీటీసీ కరెవార్ రాము లు ఆరోపించారు. ప్రభుత్వం ఎన్నికలకు ముందు అన్నిటికి అవకాశం ఇచ్చిన తరువాతే చివరి జాబితా విడుదల చేస్తారు. కానీ మద్నూర్ గ్రామానికి సంబంధించిన జాబితాలో తప్పులు ఉన్నట్లు వెల్లడించారు. సంబంధిత అధికారులు స్పందించి వెంటనే స్పష్టంగా జాబితా తయారు చేయాలని కోరారు.



ఓటరు జాబితాలో ఒక్కొక్కరి పేర్లు, రెండు, మూడు సార్లు ఉన్న దృశ్యం

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు

గిరిజన గురుకుల విద్యార్థులు



విద్యార్థులకు అభినందిస్తున్న గిరిజన గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ మాధవరావు

నసురుల్లాబాద్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): నసురుల్లాబాద్ మండల కేంద్రంలోని గిరిజన గురుకుల పాఠశాల విద్యార్థులు మంగళవారం కామారెడ్డిలో జరిగిన ఎస్‌జిఎఫ్ అండర్-19 ఉమ్మడి నిజామాబాద్ జిల్లాల సెలక్షన్ గవర్నమెంట్ జూనియర్ కాలేజ్ గ్రౌండ్‌లో జరిగాయి.. ఈ సెలక్షన్లలో నసురుల్లాబాద్ గిరిజన గురుకుల విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎం..సత్య, ఎస్.కళ్యాణ్ ఎంపికయ్యారు. వీరిని బుధవారం పాఠశాల కళాశాల ప్రిన్సిపాల్ మాదవరావు, వైస్ ప్రిన్సిపాల్ రాహుల్, పోశెట్టి, వ్యాయామ ఉపాధ్యాయులు ప్రవీణ్, అశ్విన్ మరియు ఉపాధ్యాయ బృందం అభినందించారు. నిజామాబాద్ జిల్లా తరఫున ఈనెల మహబూబాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో ఎంపికైన విద్యార్థులు పాల్గొననున్నారు.

సొంత గూటికి చేరిన మాజీ సర్పంచ్



మదన్‌ను పార్టీలోకి ఆహ్వానిస్తున్న మాజీ ఎమ్మెల్యే షిండే

పెద్దకొడప్‌గల్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోచారం తండాకు చెందిన మాజీ సర్పంచ్ మదన్‌రావు కాంగ్రెస్ పార్టీని వీడి సొంత గూటికి చేరుకున్నారు. బీఆర్‌ఎస్‌కు చెందిన మదన్‌రావ్ గత అసెంబ్లీ ఎన్నికల అనంతరం ఆ పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరారు. అనంతరం జరిగిన పరిణామాల దృష్ట్యా పిట్లం మండల కేంద్రంలో బుధవారం జరిగిన బీఆర్ఎస్ ఎన్నికల సన్నాహక సమావేశంలో జుక్కల్ మాజీ ఎమ్మెల్యే షిండే చేతుల మీదుగా బీఆర్‌ఎస్ కండువా కప్పుకున్నారు. మదన్‌తో పాటు ఆయన అనుచర గణం కాంగ్రెస్‌ని వీడి బీఆర్‌ఎస్‌లో చేరారు.

ఉప్పు, చక్కెర, నూనెల వాడకాన్ని తగ్గించాలి

● ఐసీడీఎస్ పీడీ రసూల్‌బీ

నవీపేట, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మనం ప్రతి రోజు తీసుకునే ఆహారంలో ఉప్పు, చక్కెర, నూనెల వాడకాన్ని తగ్గించి తీసుకోవాలని, వీటి వాడకం పెరిగితే అనారోగ్యం బారిన పడే ప్రమాదముందని ఐసీడీఎస్ పీడీ రసూల్‌బీ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో జరిగిన పోషణ మాసం కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రతీ రోజు మనం తీసుకునే ఆహారంలో ఆకు కూరలు, కాయగూరలు ఉండేలా చూసుకోవాలని సూచించారు. వివిధ రకాల పోషకాలు అందించే చిరు ధాన్యాలను సైతం ఆహారంలో భాగం చేసుకోవాలని ఆమె పేర్కొన్నారు. 3 నుంచి 6 ఏళ్ల లోపు గల చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాలలో పౌష్టికాహారం అందించడంతో పాటు ప్రీ స్కూల్ విద్యను అందించడం జరుగుతుందని ఆమె వివరించారు. ఈ సందర్భంగా పౌష్టికాహారం అందించే వివిధ రకాల ఆహార పదార్థాలు, చిరు ధాన్యాల ప్రదర్శన నిర్వహించారు. అనంతరం గర్భిణుకు శ్రీమంతం, చిన్నారులకు అన్నప్రాసన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నవీపేట మెడికల్ ఆఫీసర్ కావ్య, ఐసీడీఎస్ సీడీపీవో జ్యోతి, సూపర్‌వైజర్‌లు రాధాలక్ష్మి, భాగ్యలక్ష్మి, హెల్త్ సూపర్‌వైజర్‌లు, అంగన్‌వాడీ టీచర్‌లు, ఆయాలు, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.



పోషణ మాసోత్సవంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ రసూల్‌బీ

ఆరోగ్య ప్రదాయిని.. సూర్యోదయ స్నానం



మద్నూర్‌లో ప్రభాత్ పేరీ నిర్వహిస్తున్న భక్తులు

మద్నూర్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): అశ్వయుజ పౌర్ణమి నుంచి కార్తీక మాసం వరకు తెల్లవారు జామున నిర్వహించే సూర్యోదయానికి లోపు స్నానం చేసి, ప్రభాత పేరి వల్ల ఆరోగ్యప్రదాయినిగా ఉంటుందని భక్తులు విశ్వసిస్తారు. అందులో భాగంగానే మద్నూర్ మండల కేంద్రంలో భక్తులు తెల్లవారు జామున భక్తి పాటలు పాడుతూ గ్రామములోని ఆలయాలలో పూజలు నిర్వహిస్తున్నారు. కార్తీక స్నాన వ్రతం ఆచరించే వారు సూర్యోదయం లోపు బ్రహ్మీ ముహూర్తములు పుణ్య స్నానం చేసి అనంతరం శైవ, వైష్ణవ దేవాలయాల్లో దీపారాధన చేస్తుంటారు. సూర్యోదయం లోపు అభంగ స్నానాలు చేసినట్లయితే ఆరోగ్యం బాగుంటుందని పండితులు చెబుతుంటారు. నెల రోజుల పాటు మండల కేంద్రంలో భక్తులు తెల్లవారు జాము నుంచే గ్రామంలో ప్రభాత్ పేరి నిర్వహిస్తున్నారు.

సుప్రీం కోర్టు సీజేఐపై జరిగిన దాడిని ఖండిస్తున్నాం

బాన్సువాడ టౌన్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): సుప్రీం కోర్టు సీజేఐ బీఆర్‌గవాయ్‌పై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని అంబేద్కర్ సంఘం నాయకులు అన్నారు. బుధవారం పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సనాతన ధర్మంతో మతోన్మాదులు రెచ్చిపోతున్నారన్నారు. ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడే వారిని అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. గవాయ్‌పై బూటుతో దాడికి పాల్పడిన వ్యక్తిపై సుమోటో కేసు నమోదు చేయాలని, అతనిపై రౌడీషీట్ ఓపెన్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు బంగారు మైశయ్య , డివిజన్ అధ్యక్షుడు ప్రశాంత్ కుమార్, మైనార్టీ నాయకుడు ఏజాస్ , మాజీ ఏఎంసీ చైర్మెన్ నెర్రె నర్సింలు, గైని రవి, మల్లూరి సాయిలు, శ్రీనివాస్, సాయిలు తదితరులున్నారు.



బాన్సువాడలో అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

దళారుల ఆగడాలకు అడ్డుకట్ట వేసేదెవరు?

» ప్రభుత్వ ఆదాయానికి గండి

» జోరుగా హద్దులు దాటుతున్న పచ్చి ధాన్యం

» సిండికేట్‌గా మారి రైతులకు మోసం

» బోనస్ లేక, ప్రకృతి వైపరీత్యాల దృష్ట్యా దళారుల వైపు మొగ్గు చూపుతున్న రైతులు

ఎడపల్లి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగంలో ఖరీఫ్, రబీ కాలంలో వరి పంటలు నిజామాబాద్ జిల్లాలో అందరికంటే నెల రోజుల ముందే చేతికి వస్తాయి. ఇదే అదునుగా చేసుకుని కొందరు దళారి వ్యాపారులు సిండికేట్‌గా మారి భారీ మోసానికి పాల్పడుతున్నారు. పచ్చి ధాన్యం కొనుగోలుతో కోట్లాది రూపాయల వ్యాపారానికి ప్రతిఏటా దళారులు అటు రైతులను, ఇటు ప్రభుత్వాన్ని మోసం చేస్తూనే..ఉన్నారు. మితిమీరుతున్న వీరి ఆగడాలకు అడ్డుకట్ట వేసేవారు లేకపోవడంతో మూడు పువ్వులు ఆరు కాయలుగా వీరి జీరో వ్యాపారం సాఫీగా కొనసాగుతుంది.



పచ్చి ధాన్యం బస్తాలను లారీలలో నింపుతున్న దృశ్యం



కుప్పగా పోసిన పచ్చి దాన్యం దృశ్యం

● జోరుగా హద్దులు దాటుతున్న పచ్చి దాన్యం.

ప్రతి ఏటా ఖరీఫ్, రబీ కాలంలో తెలంగాణ రాష్ట్రంలోని నిజామాబాద్ జిల్లా ప్రాంతంలో పండించే సన్నరకం పచ్చి ధాన్యానికి మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. తెలంగాణ రాష్ట్రంలోని నల్గొండ జిల్లా మిర్యాలగూడ, కోదాడ ప్రాంతాలతో పాటు ఆంధ్ర, కర్నాటక, మహారాష్ట్ర ప్రాంతాలకు సుమారు వేలాదిగా లారీలలో పచ్చి ధాన్యం అమ్మకాలు, కొనుగోళ్ళ వ్యాపారం జోరుగా కొనసాగుతుంది. అయితే అంతర్‌రాష్ట్ర చెక్‌పోస్టులలో అమ్యామ్యాలు ముట్టజెప్పి ఈ దళారులు ప్రభుత్వానికి లక్షల రూపా యల్లో ఆదాయానికి గండికొడుతూ జీరో వ్యాపారం సాఫీగా కొనసాగిస్తున్నారు. ఈ వ్యాపారంపై ఏ శాఖ అధికారి కన్నెత్తి చూడక పోవడం వెనుక ఉన్న ఆంతర్యం ఏమిటో ఇప్పటికీ అంతు చిక్కడం లేదు.

● దళారులకు కలిసి వస్తున్న ప్రకృతి వైపరీత్యాలు

ప్రకృతిలో వైపరిత్యాల కారణంగా ఈదురు గాలులు, అధిక వర్షం సరిగ్గా ఈ వరి కోతల సమయంలో రావడం ఈ దళారులకు కలిసి వస్తుంది. ఇదే అదునుగా దళారులంతా సిండికేట్‌గా ఏర్పడి రైతుల పచ్చి ధాన్యం కొనుగోలుపై పక్కా ప్రణాళికతో అమాంతం ధరలను తగ్గించి రైతులను నిలువు దోపిడికి గురిచేస్తున్నారు. ఒకవైపు సకాలంలో దాన్యం కొనుగోలు కేంద్రాలు తెరవక పోవడం, తెరిచినా కఠినమైన నిబంధనలు అమలు చేయడం కారణంగా రైతులు తమ ధాన్యం పండించడం కంటే విక్రయించడం పెద్ద కష్టంగా మారింది. వారికి ఎదురయ్యే సమస్యలను ఆసరాగా చేసుకుని మార్కెట్‌లో సిండికేట్‌గా మారిన ఈ దళారులు జీరో వ్యాపారంతో కోట్లాది రూపాయలు కొల్లగొడుతున్నారు.

● భారీగా ప్రభుత్వ ఆదాయానికి గండి

ఓ దాన్యం వ్యాపారి రైతులనుంచి ఆరుగాలం శ్రమించి పండించిన పంటను కొనుగోలు చేయాలంటే ఆరు రకాల వివిధ శాఖల అనుమతులతో కూడిన లైసెన్సులను పొంది ఉండాలి. అలాంటివి ఏవి తమకేమి పట్టనట్లుగా నిజామాబాద్ జిల్లాలోని బోధన్ డివిజన్‌లో పచ్చి దాన్యం కొనుగోలు చేస్తున్న ఈ దళారుల ముఠా లక్షల్లో ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతుంది. రెవెన్యూ, పంచాయితీ, రోడ్డు రవాణా, మార్కెటింగ్, వ్యాపార వాణిజ్య పన్నుల శాఖ, ఆదాయ పన్నుల శాఖలతో పాటు పలు శాఖల అనుమతులతో కూడిన లైసెన్సు పొంది ఈ వ్యాపారం చేయాల్సి ఉండగా అవన్నీ పట్టించుకోకుండా కొంతమంది రాజకీయ నాయకుల పెద్దల సహకారంతో దందా సాఫీగా చేస్తున్నారు.

● పక్షపాత ధోరణితో ధర నిర్ణయం, కొనుగోళ్లు

ఆరుగాలం శ్రమించి పండించిన రైతు దాన్యంకు గిట్టుబాటు ధర దళారి నిర్ణయించడంతో రైతులు లబోదిబో మంటున్నారు. రాజకీయ పలుకుబడి ఉన్న భూస్వాములు, పెద్ద రైతుల పచ్చి దాన్యంకు ఒక ధర, చిన్న, సన్నకారు రైతుల దాన్యంకు మరో ధర నిర్ణయిస్తూ, ఈ సిండికేట్ దళారి వ్యవస్థ ప్రతి యేటా ఖరీఫ్, రబీలో పక్షపాత దోరణితో వ్యాపారం సాగిస్తున్నారు. ఈ విషయంపై ధరలలో వ్యత్యాసంతో నష్టపోయిన రైతులు సంబందిత దళారులపై వివిధ శాఖల అధికారులకు ఫోన్ చేసి ఫిర్యాదు చేసినా అట్టి శాఖల అధికారులు పట్టించకోక పోవడంతో నష్టపోయిన రైతన్న కన్నీటి పర్యంతం అవుతున్నారు. ఇది ఇలా ఉంటే దళారి కొనుగోలు చేసిన రైతులకు దాన్యం డబ్బులు ఇవ్వడంలో కూడా అవలంబిస్తున్న పక్షపాత వైఖరి చిన్న, సన్నకారు రైతులకు తీవ్ర మనోవేదనకు గురి చేస్తుంది.

● అన్నీ తానై దళారుల వ్యాపారం

బోధన్ నియోజక వర్గంలో కొంతమంది దళారులు దాన్యం వ్యాపారంలో కొన్ని జిమ్మిక్కులకు పాల్పడుతున్నారు. అవి ఏమిటంటే దాన్యం దిగుబడి అధికంగా ఉన్న గ్రామాలను ఎంపిక చేసుకుని రైతుల సమస్యలను ఆసరాగా చేసుకుని రైతులకు ముందస్తుగా పెట్టుబడి సాయం పేరుతో వడ్డీలకు డబ్బులు చెల్లిస్తున్నారు. ఈ దళారులు బినామీ పేరు తోనే రసాయన ఎరువుల దుకాణాలు తెరచి వరినాటు మొదలు కొని పిచికారీ చేయడానికి రసాయన మందులు, వరి కోతలకు సూర్పిడి యం త్రాలను సమకూర్చడం అనంతరం పండించిన పచ్చి దాన్యాన్ని తామే కొనుగోలు చేయడం వీరి వంతవుతుంది. ఇలా రైతుకిచ్చిన పెట్టుబడి సాయం ఖర్చులను వడ్డీతో వసూలు చేస్తూ అన్నీ పోను మిగిలినవి రైతు చేతికిచ్చి భారీగా అక్రమ వ్యాపారానికి తెరదీస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

● కొనుగోలు కేంద్రాల్లో వర్షాకాలం పచ్చి దాన్యం కొనుగోలు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి

వర్షాకాలంలో పంటకోత సమయంలో వర్షాలు ఎక్కువగా పడుతుండడం, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో పచ్చి దాన్యం కొనకపోవడంతో ప్రకృతి వైపరిత్యాల వల్ల రైతులు తప్పని పరిస్థితులలో దళారులను ఆశ్రయించాల్సి వస్తుంది. ప్రతీయేటా ధాన్యం కోత సమయంలో ప్రకృతి విలయ తాండవం చేస్తుండడంతో రైత ఆరుగాలం పండించిన పంట చేతికందుతుందో లేదోనని భయపడి దళారులు చెప్పిన ధరకే దాన్యం అమ్మి నష్టాల ఊబిలో చిక్కుకంటున్నారు. ప్రభుత్వం ప్రకృతి వైపరిత్యా లను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ద్వారా పచ్చి ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని మండల రైతులు కోరుతున్నారు.

దళారి వ్యవస్థతో ఇబ్బందులు

● ప్రవీణ్ కుమార్, ఎడపల్లి రైతు



దళారి వ్యవస్థతో పెద్ద రైతులకు ఎలాంటి ముప్పు జరగడం లేదని ముప్పంతా చిన్న, సన్నకారు రైతులకే జరుగుతుందని, వరి నాటు సమయంలో కూడా దళారులు చెప్పిన వారికే కూలీలు వెల్లడం, వడ్లు నింపే సమయంలో కూడా పెద్ద రైతులవి ముందు నింపి తరవాత చిన్న, సన్నకారు రైతుల ధాన్యం నింపడం జరుగుతుండడం వల్ల ప్రకృతి వైపరీత్యాలు జరిగినపుడు ఎక్కువగా చిన్న, సన్నకారు రైతులే నష్టపోతున్నారన్నారు. దళారులు సిండికేట్‌గా మారి పెద్ద రైతులకు ఒక దర చిన్న, సన్నకారు రైతులకు ఒక ధర చెల్లిస్తూ వారికి ఇష్టం వచ్చిన ధరకు వడ్లను కొనుగోలు చేస్తున్నారన్నారు. కొనుగోలు చేసిన తరువాత డబ్బులు కూడా నెలల కాల వ్యవధిలో చెల్లింపులు చేస్తున్నారన్నారు. దళారుల వ్యాపారంపై అధికారులు నిఘా పెట్టి రైతులు మోసపోకుండా చూడాలని చిన్న, సన్నకారు రైతులు కోరుతున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్

వరద బాధితులను విస్మరించడం సరికాదు

కామారెడ్డిటౌన్, అక్టోబరు 8, (ఆంధ్రజ్యోతి): వరద బాధితులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విస్మరించడం సరికాదని సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ అన్నారు. బుధవారం సీపీఎం కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆగస్టు 26, 27వ తేదీల్లో వచ్చిన భారీ వరదల వల్ల జాతీయ రహదారులు సహా ఇతర దారులన్నీ ధ్వంసమయ్యాయన్నారు. మరో వైపు రైతులు కష్టార్జితమంతా నీటిలో కొట్టుకుపోయిందని అన్నారు. ప్రధానంగా జీఆర్ కాలనీ, కౌండిన్య కాలనీ, బతుకమ్మ కుంట, టీచర్స్‌కాలనీ, గాంధీనగర్ లాంటి నివాస ప్రాంతాలు వరద నీటితో నిండిపోయాని అన్నారు. దీంతో ఒక్కో కుటుంబానికి రూ.10 లక్షల నుంచి రూ.15లక్షల వరకు నష్టం వాటిల్లిందని తెలిపారు. వరదలు వచ్చినప్పుడు స్పందించిన సీఎం బాధితులకు తగిన నష్టపరిహారం అందించడంలో మాత్రం విఫలమయ్యారని అన్నారు. ఇక కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కామారెడ్డి ప్రజలను అవమాన పరిచేలా ఉందని, ఇప్పటికైనా సందర్శనకు వచ్చిన కేంద్రబృందానికి ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. నష్టపోయిన పంటకు రూ.40 వేలు, కుటుంబానికి రూ.10లక్షల చొప్పున అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు వెంకట్‌గౌడ్, మోతీరాం నాయక్, కొత్తనర్సింలు, ముదాం అరుణ్, తదితరులు పాల్గొన్నారు.

దాడికి యత్నించిన వారిపై చర్యలు తీసుకోవాలి



దోమకొండ, అక్టోబరు 8, (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయిపై దాడికి యత్నించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పంచాయతీ రాజ్ మినిస్ట్రియల్ ఉద్యోగుల సంఘం బ్లాక్ ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ అన్నారు. బుధవారం దోమకొండలో ఆయన మాట్లాడారు. అత్యున్నత న్యాయస్థానంలో ఉన్నత పదవిలో ఉన్న న్యాయమూర్తిపై దాడికి యత్నించడం అమానుషమని అన్నారు. నిందితుడిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.


ఎక్కపల్లిలో టీడీపీలో చేరిన కార్యకర్తలు

ఎన్నికల్లో టీడీపీ జెండా ఎగురవేస్తాం

లింగంపేట, అక్టోబర్ 8, (ఆంధ్రజ్యోతి): మండలంలో జడ్పీటీసీ స్థానాన్ని గెలుచుకొని టీడీపీ జెండా ఎగురవేస్తామని టీడీపీ మండల అధ్యక్షుడు భీంరావు అన్నారు. బుధవారం లింగంపేట మండలంలోని ఎక్కపల్లిలో వివిధ పార్టీలకు చెందిన రాములు, సాయిలు, బాలయ్యలతో పాటు10మంది కార్యకర్తలు ఆయన సమక్షంలో టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎన్టీఆర్, చంద్రబాబు గ్రామాల అభివృద్ధికి కృషి చేశారని అన్నారు. ప్రజల సంక్షేమానికి రూ.2కే కిలో బియ్యం, వృద్ధులకు, వితంతువులకు, వికలాంగులకు పెన్షన్ సదుపాయం వంటి ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారన్నారు. వాటినే ఇప్పటి ప్రభుత్వాలు అమలు చేస్తున్నాయని చెప్పారు. మండలంలో ఇప్పటికీ టీడీపీకి మంచి కార్యకర్తలు ఉన్నారన్నారు. టీడీపీ నాయకులు విశ్వేశ్వర్, కృష్ణ, తిరుపతి, జగ్యానాయక్, కిషన్‌లు ఉన్నారు.

వరదల నష్టంపై కేంద్రానికి నివేదిస్తాం

(5వ పేజీ తరువాయి)

ఎస్ఈ శ్రావణ్‌కుమార్, ఇంజనీరింగ్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

భిక్కనూరు, ఎల్లారెడ్డి, లింగంపేట, నాగిరెడ్డిపేట మండలాల్లో కేంద్ర బృందం పర్యటించింది. ఎల్లారెడ్డి మండల పరిధిలోని హాజీపూర్, లక్ష్మాపూర్ ప్రాంతాల్లో ధ్వంసమైన రోడ్లను అడవి లింగాల గేటు సమీపంలో కొట్టుకుపోయిన వంతెనను, వాగు పరివాహక ప్రాంతంలో జరిగిన పంట నష్టాలను పరిశీలించారు. భిక్కనూరు మండలంలో కేంద్ర బృందం సభ్యుల బృందం బుధవారం పర్యటించింది. మండలంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న రోడ్లను, పంటలను, తెగిన చెరువు, కుంటలను హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రెటరీ పీకే రాయ్‌తో కూడిన బృందం సభ్యులు పరిశీలించి మండలంలో ఎంత మేర పంటలు దెబ్బతిన్నాయి, ఎన్ని ఎకరాల పంట పొలాల్లో ఇసుక మేటలు పేరుకుపోయాయి, రోడ్లు ఎంత మేర దెబ్బతిన్నాయి, తదితర అంశాలను కలెక్టర్ ఆశీష్‌సాంగ్వాన్, అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వారి వెంట కలెక్టర్‌తో పాటుగా అదనపు కలెక్టర్ విక్టర్, జిల్లా ఇరిగేషన్, వ్యవసాయాధికారులు, మండల అధికారులు పాల్గొన్నారు.

● నాగిరెడ్డిపేట మండలంలో బుధవారం కేంద్ర బృందం అధికారులు పర్యటించారు. పోచారం ప్రాజెక్టును , మండలంలో మంజీరా నది వరదలతో పంటలు ముంపుకు గురై నష్టపోయిన పంటలను కేంద్ర బృందం అధికారులు పరిశీలించారు. ఇంటర్ మినిస్ట్రీయల్ సెంట్రల్ టీం,(ఐఎంసీటీ) మినిస్ట్రీ ఆఫ్ హోమ్ అఫైర్స్ జాయింట్ సెక్రెటరీ పీ. కే.రాయ్ ఆధ్వర్యంలో కేంద్ర బృందం అధికారులు జిల్లా కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్, జిల్లా నీటిపారుదల శాఖ అధికారులు, రెవెన్యూ అధికారులతో కలిసి పోచారం ప్రాజెక్టును, మండలంలో నష్టపోయిన పంటలను పరిశీలించారు. భారీ వర్షాల కారణంగా పోచారం ప్రాజెక్టుకు భారీ వరద నీరు వచ్చి ప్రాజెక్టు కట్ట వద్ద మట్టి కోతకు గురై, మట్టికొట్టుకుపోయి గుంత ఏర్పడగా, ప్రాజెక్టు వద్ద ఏర్పడిన గుంతకు వెంటనే జరిపిన మరమ్మత్తు పనులను కేంద్ర బృందం అధికారులు పరిశీలించారు. 103 సంవత్సరాల పోచారం ప్రాజెక్టుకు సంబంధించిన వివరాలను నీటిపారుదల శాఖ అధికారులతో కేంద్ర బృందం అధికారులు తెలుసుకున్నారు. అలాగే మండల కేంద్రం సమీపంలో మంజీరా వరదల కారణంగా పంటలు ముంపుకు గురై నష్టపోయిన పంటలను కేంద్ర బృందం పరిశీలించింది. మండలంలో భారీ వర్షాల కారణంగా, మంజీరా వరదలతో నీట మునిగి నష్టపోయిన పంటల వివరాలను అధికారులు కేంద్ర బృందంకు వివరించారు. కేంద్ర బృందం వెంట జిల్లా కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్, జిల్లా నీటిపారుదల శాఖ చీఫ్ ఇంజనీర్ శ్రీనివాస్, ఈఈ మల్లేశం, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మోహన్ రెడ్డి, ఎల్లారెడ్డి ఆర్డీవో పార్థసింహారెడ్డి, ఇరిగేషన్ డీఈ వెంకటేశ్వర్లు,ఏడీఏ సుధా మాధురి, తహసీల్దార్ శ్రీనివాస్ రావు, ఎంపీడీవో లలిత కుమారి, ఎంపీవో ప్రభాకర్ చారి, ఏవో సాయికిరణ్, ఇరిగేషన్ ఏఈ అక్షయ్ కుమార్ తదితరులు ఉన్నారు.

● లింగంపేట మండలంలోని లింగంపల్లి వద్ద ఎల్లారెడ్డి-కామారెడ్డి రహదారిపై కూలిన వంతెనను బుధవారం కేంద్ర బృందం సభ్యులు పరిశీలించారు. నెల రోజుల క్రితం భారి వర్షాల కారణంగా వరదలకు తెగిన వంతెన గురించి కేంద్ర బృందం సభ్యులకు కలెక్టర్ ఆశీష్‌సాంగ్వాన్ వివరించారు. మండలంలో పంటలు సైతం దెబ్బతిన్నాయని వారికి వివరించారు.

● బీబీపేట మండల కేంద్రంలోని బ్రిడ్జిని బుధవారం కేంద్ర బృందం సభ్యులు పరిశీలించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఎడ్లకట్ట వాగు ఉధృతంగా పారడంతో బీబీపేట పెద్ద చెరువు నిండింది. పెద్ద ఎత్తున వర్షపు నీరు పారడంతో బ్రిడ్జి వద్ద రోడ్డు రెండుపక్కల కొట్టుకుపోయింది. కొట్టుకుపోయిన రోడ్డును కేంద్ర బృందం పర్యటించి పరిశీలించింది. కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ వరద వివరాలను వారికి వివరించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు ఉన్నారు.


జిల్లా కేంద్రంలో వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలిస్తున్న కేంద్రబృందం సభ్యులు


భిక్కనూరు మండల కేంద్రంలో దాసనమ్మకుంటను పరిశీలిస్తున్న సభ్యులు


ఎల్లారెడ్డిలో అధికారులతో మాట్లాడుతున్న కేంద్ర బృందం సభ్యులు

కాంగ్రెస్ నుంచి ఏలేటి భూంరెడ్డి సస్పెన్షన్

సదాశివనగర్, అక్టోబరు 8, (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుప్రియాల్ గ్రామానికి చెందిన ఏలేటి భూంరెడ్డికి కాంగ్రెస్ పార్టీతో ఎలాంటి సంబంధం లేదని ఆ పార్టీ మండల అధ్యక్షుడు జూకంటి సంగారెడ్డి బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏలేటి భూంరెడ్డి పార్టీలో నిలకడగా లేకుండా, పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు ఆదేశాల ప్రకారం కాంగ్రెస్ పార్టీ నుంచి ఆయనను సస్పెండ్ చేసినట్లు తెలిపారు.


సమావేశంలో మాట్లాడుతున్న మోతీరాం

ఎన్నికల్లో సత్తా చాటాలి

గాంధారి, అక్టోబరు 8, (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని సీపీఎం ఎల్లారెడ్డి ఏరియా కార్యదర్శి మోతీరాం నాయక్ అన్నారు. బుధవారం గాంధారి మండలకేంద్రంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎంపీటీసీ. జడ్పీటీసీ, సర్పంచ్‌లలో సీపీఎం నిలబెట్టిన అభ్యర్థులని గెలిపించుకోవాలన్నారు. క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ప్రజలకు ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తూ ఓట్లు అభ్యర్థించాలని సూచించారు. సాధ్యమైనంత మేర ఎక్కువగా ప్రజల్లోకి వెళ్లాలని తెలిపారు. సీపీఎం పార్టీ బలంగా ఉన్న ప్రాంతాల్లో పోటీ చేస్తుందని అన్నారు. అలాంటి పరిస్థితులు లేని చోట లౌకిక పార్టీలకు మద్దతు తెలుపుతామన్నారు. బీజేపీ దానికి మద్దతు తెలిపే పార్టీలను చిత్తుగా ఓడిస్తామని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సరాఫ్ కిషన్, ప్రకాష్, రాములు, స్వతంత్ర, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి నామినేషన్ల స్వీకరణ

భిక్కనూరు, అక్టోబరు 8, (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు భిక్కనూరు మండలంలోని 18 గ్రామ పంచాయతీల పరిధిలోని 14 ఎంపీటీసీ స్థానాలకు, భిక్కనూరు జడ్పీటీసీ స్థానానికి సంబంధించి గురువారం నుంచి స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయు అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరించనున్నట్లు ఎంపీడీవో రాజ్‌కిరణ్ రెడ్డి బుధవారం తెలిపారు. ఈ నెల 11వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎంపీటీసీ స్థానాలకు మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో, జడ్పీటీసీ స్థానానికి మండల సమాఖ్య కార్యాలయ సమావేశ మందిరంలో ఉదయం 10:30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు స్వీకరించనున్నామని ఆయన వివరించారు.

సిండికేట్‌గానే టెండర్లు

(5వ పేజీ తరువాయి)

వ్యాపారులే కాకుండా సాధారణ ప్రజలు, ఉద్యోగులు సైతం పాల్గొన్నారు. అంతకుముందు ఏడాదితో పోలిస్తే 2023లో దరఖాస్తుల సంఖ్య భారీగా పెరిగింది. 1940 టెండర్లు వేశారు. దీంతో ప్రభుత్వానికి భారీగా ఆదాయం సమకూరింది. ఈ ఏడాది డిసెంబరుతో గడువు ముగుస్తుండగా ప్రభుత్వం 3 నెలల ముందే టెండర్లు ఆహ్వానించింది. గతనెల 26 నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఈనెల 18తో గడువు ముగియనుంది. దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమై 13 రోజులు గడిచినా 45 దరఖాస్తులు వచ్చాయి. 20 మద్యం దుకాణాలకు ఒక్క దరఖాస్తు కూడా దాఖలు కాలేదు.

వేచిచూసే ధోరణిలో..

గత ఏడాది అత్యధిక అమ్మకాలు జరిపిన బెల్ట్‌షాపులను గుర్తించి కొత్త మద్యం దుకాణాలు ఏర్పాటు చేశారు. రెండేళ్లతో పోలిస్తే అమ్మకాలు ఘననీయంగా పెరిగినప్పటికీ దుకాణాల సంఖ్య పెంచలేదు. అధికారులకు మద్యం వ్యాపారులతో ఉన్న అంతర్గత ఒప్పందాల వల్లే దుకాణాల సంఖ్య పెంచలేదనే విమర్శలు ఉన్నాయి. లక్కీడ్రా పద్ధతిన దుకాణాల ఎంపిక చేయనున్న నేపథ్యంలో ఎవరికి దక్కుతాయనే ఉత్కంఠ నెలకొంది. జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ డివిజన్‌ల పరిధిలో మొత్తం 49 మద్యం దుకాణాలు ఉండగా ఇప్పటి వరకు 45 దరఖాస్తులు వచ్చాయి. నిజాంసాగర్ వైన్స్‌కు అత్యధికంగా 13 దరఖాస్తులు వచ్చాయి. 20 మద్యం దుకాణాలకు ఏ ఒక్క దరఖాస్తు కూడా దాఖలు కాలేదు. వైన్స్‌లకు టెండర్లు వేయడంపై వేచిచూసే ధోరణిలో ఉన్నట్లు తెలుస్తోంది.

సిండికేట్‌కే మొగ్గు..

వ్యాపారులు వ్యక్తిగతంగా కాకుండా సిండికేట్‌గా ఏర్పడి టెండర్లు వేసేందుకు మొగ్గు చూపుతున్నారు. గతంలో చాలా చోట్ల ప్రభుత్వ ఉద్యోగులు సైతం వారి కుటుంబ సభ్యుల పేరిట దరఖాస్తులు వేశారు. మహిళలు సైతం చాలా మంది పాల్గొన్నారు. జిల్లాలో 15 నుంచి 20 దుకాణాల్లో అమ్మకాలు భారీగా ఉండడంతో వాటికి పోటీ ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. పలుకుబడి ఉన్న కొందరు వారు ఎంచుకున్న వైన్స్‌లకు ఇతరులు పోటీ రాకుండా ప్రయత్నం చేస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. 2023లో మద్నూర్‌లోని ఓ వైన్స్‌కు ఎక్కువగా సిండికేట్‌లు ఏర్పడ్డాయి. ఒక్కో గ్రూపులో 30 నుంచి 60 మంది సభ్యులు ఉండడం గమనార్హం. వీరికి మూడు నుంచి ఐదు దుకాణాలకు టెండర్లు వేశారు. టెండర్ డబ్బు నష్టపోకుండా ఉండేందుకు ఇలా సిండికేట్ అవుతున్నట్లు తెలుస్తోంది. ఏ ఒక్కరికి దుకాణం వచ్చినా సభ్యులంతా పార్టనర్‌లు కావచ్చనే ఉద్దేశ్యంతో ఇలా వ్యవహరించారు. ఈసారి కూడా ఇదే పద్ధతి అవలంబించే అవకాశం లేకపోలేదని తెలుస్తోంది.


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఆర్డీవో

కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

మోపాల్, అక్టోబరు 8, (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం గ్రామాల్లో ఏర్పాటుచేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీవో రాజేంద్రకుమార్ రైతులకు సూచించారు. బుధవారం మాధవనగర్ ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో కేశాపూర్, మాధవనగర్ గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఆర్డీవో ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు కష్టపడి పండించిన ధాన్యాన్ని దళారులకు అమ్ముకొని మోసపోకుండా ఉండేందుకు ప్రభుత్వం గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేస్తుందని తెలిపారు. రైతులు పండించిన ధాన్యాన్ని తప్పనిసరిగా కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించుకొని మద్దతు ధర పొందాలని సూచించారు. కార్యక్రమంలో సొసైటీ సీఈవో వంశీకృష్ణ, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

హోంగార్డులకు రెయిన్‌కోట్‌ల అందజేత

సుభాష్‌నగర్, అక్టోబరు 8, (ఆంధ్రజ్యోతి): వర్షాకాలం, చలికాలం నుంచి రక్షించుకోవడానికి హోంగార్డులకు రెయిన్‌కోట్‌లను అందిస్తున్నామని పోలీస్ కమీషనర్ సాయిచైతన్య తెలిపారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ కమీషనరేట్ కార్యాలయంలో జిల్లాలోని సుమారు 362 మంది హోంగార్డ్‌లకు బుధవారం రెయిన్‌కోట్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాకాలం, చలికాలంలో ప్రతి ఒక్కరు ఈ రెయిన్ కోట్‌ను వాడాలన్నారు. విధినిర్వహణలో ప్రతి ఒక్కరు అవసరం నిమిత్తం ఉపయోగించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ ఏఆర్ రామచందర్‌రావు, హోంగార్డ్ విభాగం, రిజర్వు ఇన్‌స్పెక్టర్ సతీష్, హోంగార్డ్‌లు తదితరులు పాల్గొన్నారు.



రెయిన్‌కోట్‌లను అందజేస్తున్న సీపీ


నివాళులు అర్పిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్

రూరల్ ఎమ్మెల్యేకు పరామర్శ

ఇందూరు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డిని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ బుధవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో పరామర్శించారు. భూపతిరెడ్డి తల్లి లక్ష్మీ నర్సమ్మ ఇటీవల మృతి చెందిన విషయం తెలుసుకున్న ఆయన నగరంలోని బైపాస్‌రోడ్‌లోగల క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అనంతరం లక్ష్మీనర్సమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆమె ఆత్మకు శాంతికలగాలని భగవంతున్ని ప్రార్థించారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ అనంత్‌రెడ్డి, మాజీ సర్పంచ్ పద్మరెడ్డి, బీజేపీ జిల్లా కోశాధికారి శ్రీనివాస్‌రెడ్డి, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు నక్కరాజేశ్వరి, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

13న వినియోగంలో లేని సామగ్రి వేలం

ఇందూరు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ పోలీస్ కమీషనరేట్ పరిధిలో పోలీస్ ఏఆర్ స్టోర్ కార్యాలయంలోని వినియోగంలో లేని, కాలం పూర్తయిన పలు సామాగ్రిలను వేలం వేయనున్నట్లు పోలీస్ కమీషనర్ సాయిచైతన్య ఒక ప్రకటనలో తెలిపారు. పోలీస్ కార్బైనైట్ లాటీ, షీల్డ్స్, ప్లాస్టిక్ హెల్మెట్స్, బాడీ ప్రొటెక్టర్స్, స్టీల్ చైన్స్, చైర్స్, బెల్ హిల్లెర్స్, టార్చ్‌లైట్స్, వెబ్ సీలింగ్స్, హ్యాండ్ కఫ్స్, ఐరన్ (లీడింగ్ చైన్స్), వుడెన్ టేబుల్ చైర్స్, బెంచ్‌లు, స్టూల్స్, రాక్స్, బాక్స్ తదితర వాటిని ఈనెల 13వ తేదీన ఉదయం 10గంటలకు జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో వేలం వేస్తామని తెలిపారు. ఆసక్తిగల వారు పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి

కామారెడ్డిటౌన్, అక్టోబరు8, (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని గురుకుల విద్యాలయ కార్యదర్శి రమణ కుమార్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆవాస్ విద్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు, ప్రగతిని పరిశీలించారు. ఆవాస పాఠశాలలోని సరుకుల గదిని, వంటగదిని, శౌచాలయాలను పరిశీలించారు. విద్యార్థుల హాజరు మెరుగుపడాలని తెలిపారు. జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి వేణుగోపాల్, కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి నాగవేందర్ పాల్గొన్నారు.


రికార్డులు పరిశీలిస్తున్న రమణకుమార్

విజయం కోసం కృషి చేయాలి

మోపాల్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ బలపర్చిన అభ్యర్థుల గెలుపు కోసం కార్యకర్తలు కృషి చేయాలని నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి సూచించారు. బుధవారం నిర్వహించిన మోపాల్ మండల కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ఎన్నికలను ఒక సవాల్‌గా తీసుకోవాలని సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజాసంక్షేమం కోసం చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు రెండు ఒక్కటేనని అన్నారు. రూరల్ ఎమ్మెల్యే డా.భూపతిరెడ్డి బలపర్చిన అభ్యర్థులను గెలిపించి ఎమ్మెల్యేకు కానుకగా ఇవ్వాలన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం 10 సంవత్సరాలు అధికారంలో ఉన్నప్పుడు ఏ ఒక్కరికి కూడా రేషన్ కార్డులు, ఇండ్ల పంపిణీ చేయలేదని అన్నారు. నాయకులు చంద్రశేఖర్‌గౌడ్, మునిపల్లి సాయరెడ్డి, కంచెట్టి గంగాధర్, పార్టీ అధ్యక్షుడు సాయరెడ్డి, బాడ్సీ చైర్మన్ మోహన్‌రెడ్డి, బాబురావు పాల్గొన్నారు.

● నిజామాబాద్ రూరల్ మండలం గుండారం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని కోరారు.


మోపాల్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న ముప్ప గంగారెడ్డి

మాదక ద్రవ్యాలపై అప్రమత్తంగా ఉండాలి

గాంధారి, అక్టోబరు 8, (ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని గాంధారి ఎస్సై ఆంజనేయులు సూచించారు. బుధవారం గాంధారి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన మాదక ద్రవ్యాలపై అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మత్తు పదార్థాలకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని చెప్పారు. అదేవిధంగా రోడ్డు భద్రత పట్ల విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని, 18సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. అనంతరం తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు ఆటపాటల ద్వారా విద్యార్థులకు అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో కళాబృందం సభ్యులు రమేష్ రావు, మహేందర్, దివ్య, నాగరాజు, సవిత, విఠల్‌రెడ్డి, రాంచంద్రం, తిరుపతి, లక్ష్మీనారాయణ, పోశెట్టి, లతా, నరేష్, శిల్పా, కాశీరాం, కళాశాల అధ్యాపక బృందం, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న పోలీసు బృందం సభ్యులు

దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం చెల్లించాలి

సదాశివనగర్, అక్టోబరు 8, (ఆంధ్రజ్యోతి): అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలకు ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం అందజేయాలని భారతీయ కిసాన్ సంఘ్ మండల అధ్యక్షుడు కొప్పుల నర్సారెడ్డి అన్నారు. బుధవారం సదాశివనగర్ బీఎంఎస్ కార్యవర్గాల సమావేశం నిర్వహించి తహసీల్దార్ సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంటల కొనుగోలు సెంటర్లను వెంటనే ప్రారంభించాలని, అలాగే అకాల వర్షాలకు నష్టపోయిన పంటలు సర్వే చేసి ప్రతి గుంటకు నష్టపరిహారాన్ని ప్రభుత్వంతో ఇప్పించాలని కోరారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. సంఘ మండల కార్యదర్శి మార నారాయణరెడ్డి, జిల్లా మీడియా ప్రముఖ మనోహర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు కోతి లింబారెడ్డి, సంకరి శ్రీనివాస్, వివిధ గ్రామాల అధ్యక్షులు, తదితరులు పాల్గొన్నారు.


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీఎంఎస్ సభ్యులు

సినిమా గైడ్

కామారెడ్డి

ప్రియ 70- భద్రకాళీ
ప్రియ 35- లిటిల్ హార్ట్స్
దర్శన్- మిరాయి

బాన్సువాడ

మహేశ్వరి	ఓజీ
వెంకటేశ్వర	కాంతార

చికెన్ ధరలు

రకం	సుగుణ	వెన్‌కాబ్
లైవ్	రూ.140	రూ.170
స్కిన్	రూ.200	రూ.210
స్కిన్‌లెస్	రూ. 220	రూ.230